పత్రికాప్రకటన                                                                                                    కాకినాడ, 2.10.2018

జాతిపిత మహాత్మా గాంధీ ఆదర్శాలు, ప్రవచనాలను నిత్య అనుసరనీయ సూత్రాలుగా ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కోరారు.

మంగళవారం ఉదయం 150వ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించి కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్ముని విగ్రహానికి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జాయింట్ కలెక్టర్లు ఎ.మల్లికార్జున, సిహెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించి, పిల్లలు విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ సర్వ జనహితమైన సమాజం కొరకు వ్యక్తి పాటించాల్సిన నియమ నిష్టలను మహాత్ముడు స్వయంగా ఆచరించి సార్వజనీన ఆదర్శాలుగా నిలిపారని, ప్రతి ఒక్కరూ వీటిని అనుసరించాలని కోరారు. సేవల కొరకు వచ్చే ప్రజలతో ఏ విధంగా వ్యవహరించి మన్ననలు పొందాలో సూచిస్తూ గాంధీజీ తెలిపిన అంశాలను ప్రతి అధికారి, ప్రభుత్వ ఉద్యోగి తెలుసుకుని పాటించాలని ఆయన సూచించారు. అనంతరం ఎస్.సి, ఎస్టి ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కొరకు కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఒక తహశిల్దారు, గిరిజన సంక్షేమాధికారి, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లతో నిత్యం పనిచేసేలా ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల ప్రజలు, మహిళలు, వికలాంగులు తమ సమస్యలను గ్రివెన్స్ రోజు వరకూ వేచి ఉండనవసరం లేకుండా ఈ సెల్‌కు ఎప్పుడైనా తెలిజేసి సత్వర పరిష్కారం పొందవచ్చునని ఆయన తెలిపారు. దాడులు, దురాగతాలకు గురైన ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు ఈ ప్రత్యేక విభాగం పనిచేస్తుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు ఈ సెల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, కలెక్టరేట్ ఏఓ భీమారావు, జిల్లా అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)